ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 తమిళనాడు TAMILNADU
సోమవారం 20 మే 2024



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు - రథోత్సవం సందర్భంగా ఇష్టదేవేరులతో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామి(ఇన్‌సెట్లో)

నేత్రపర్వంగా మురుగన్ మహారథోత్సవం

● భక్తజనసంద్రంగా వడపళని

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం వడపళని మురుగన్ ఆలయంలో ఆదివారం ఉదయం మహారథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆ ఆలయంలో పది రోజులపాటు జరిగే వైయ్యాసి విశాఖ ఉత్సవాలు ఈ నెల 13న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ స్వామి వారు వళ్ళిదేవసేన సమేతులై మంగళగిరి విమానంలో, సూర్యప్రభ, చంద్ర ప్రభ వాహనాల్లో, నాగవాహనంలో ఆలయ వీధుల్లో ఊరేగారు. శనివారం స్వామివారు గజ వాహనంలో ఇష్టదేవేరుల సమేతుడై ఊరేగారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన మహారథోత్సవం ఆదివారం ఉదయం కనుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు నగరం నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు విచ్చేశారు. ఉదయం ఆరుగంటలకు ఇష్టదేవేరుల సమేతుడైన స్వామివారు రథంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠంపై ఆశీనులుయ్యారు. ఆ తర్వాత భక్తులు రథానికి ఇరువైపులా మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ వెళ్లారు. ప్రధాన వీధుల్లో ఊరేగిన తర్వాత స్వామివారు ఉదయం 10 గంటలకు రథమండపానికి చేరుకున్నారు. రాత్రి ఒయ్యావి ఉత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి ఏడు గంటలకు స్వామివారు అశ్వావాహనంలో, మంగళవారం రాత్రి పళని ఆండవర్ స్వామి ఆలయ వీధులలో ఊరేగుతారు. వయ్యాసి విశాఖ దినమైన బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు వళ్ళి దేవసేన సమేత షణ్ముఖస్వామి ఊరేగింపు, ఉదయం 10 గంటలకు తీర్థవారీ, కలశాభిషేకం జరుగుతాయి. ఆ తర్వాత తిరుకల్యాణోత్సవం, మయూర వాహనంలో ఊరేగింపు వరుసగా నిర్వహించనున్నారు. చివరగా ధ్వజావరోహణంతో ఈ వయ్యాశి విశాఖ ఉత్సవాలు ముగియనున్నాయి.

కమల్.. కిం కర్తవ్యం?

భవిష్యత్తులోనూ డీఎంకే కూటమితోనే ● త్వరలో ఎంఎన్‌ఎం నిర్ణయం



చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): గత పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమితో కలిసిన 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్‌ఎం) భవిష్యత్తులో ఏం చేయనుంది?.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీతోనే కలిసి సాగుతుందా?.. లేక ఒంటరిగా పోటీ చేయాలనే నిర్ణయం తీసుకుంటుందా?.. కమల్ రాజ్యసభకు వెళ్లేదెన్నడు?.. ఇంతకీ ఎంఎన్‌ఎం దారెటు?.. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఇదే చర్చ జరుగుతోంది. దీనిపై రాజకీయవర్గాలు పలు రకాలుగా విశ్లేషిస్తున్నాయి. అయితే రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకొస్తానంటూ ప్రకటించిన కమల్.. పాత పార్టీల తరహాలోనే కూటమి పంచన చేరడం మాత్రం పలు వర్గాలకు మింగుడు పడడం లేదు.

కమల్‌కే రాజ్యసభ సీటు

2018లో ఎంఎన్‌ఎం పార్టీని స్థాపించిన కమల్.. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆ తరువాత ఆ తరువాత 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 142 స్థానాల్లో పోటీ చేసిన ఎంఎన్‌ఎం.. ఒక్కచోటా గెలవలేక చతికిలబడింది. కోయంబత్తూరు దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కమల్.. బీజేపీ అభ్యర్థి వానతి శ్రీనివాసన్ చేతిలో స్వల్ప మెజారిటీతో పరాజయం పాలయ్యారు. ఈ రెండు ఎన్నికల్లోనూ కమల్ డీఎంకే, అన్నాడీంకేలను తూర్పారబట్టారు. దాంతో భావి ఎన్నికల్లోనూ కమల్ ఒంటరిగానే పోటీ చేస్తారని అందరూ భావించారు. కానీ కమల్ ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అనూహ్యంగా డీఎంకే కూటమితో జత కట్టారు. అయితే ఆయన పార్టీకి మాత్రం కూటమిలో ఒక్క స్థానం కూడా దక్కలేదు. కానీ భవిష్యత్తులో రాజ్యసభ సీటు ఇస్తామని డీఎంకే హామీ ఇచ్చింది. దీంతో కమల్ రాజ్యసభ మెట్లెక్కుతారని అన్ని వర్గాలు భావిస్తున్నాయి. ఆయన పార్టీ నుంచి ఇతరులు రాజ్యసభకు వెళ్లే అవకాశముందని కొందరు వ్యాఖ్యానిస్తున్నా.. కమల్‌కే ఆ అవకాశం ఇస్తామని డీఎంకే వర్గాలు తెగేసి చెబుతున్నాయి.

డీఎంకే కూటమితోనే..!

డీఎంకే నుంచి రాజ్యసభ స్థానం పొందనున్న ఎంఎన్‌ఎం.. 2026లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ పార్టీతోనే జత కట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది. కూటమి నుంచి కొన్ని స్థానాలు పొంది.. పోటీ చేయాలని యోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే కమల్ కూడా తన పార్టీ నేతలతో భేటీ అయి స్పష్టత ఇవ్వనున్నట్లు సమాచారం. ఇదిలా వుండగా గత ఐదు దశాబ్దాలుగా రాష్ట్రంలోని పార్టీలన్నీ డీఎంకే, అన్నాడీఎంకే కూటముల్లో ఏదో ఒకదానిని ఎన్నుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సొంతంగా పోటీ చేస్తే ఆయా పార్టీలకు మిగిలింది శూన్యమే. దీంతో ఆయా పార్టీలు ఆ రెండు పార్టీల్లో ఏదో ఒక దానిని శరణు జొచ్చడం ఆనవాయితీగా మారింది. ఇప్పుడు ఎంఎన్‌ఎం కూడా అదే బాట పట్టింది.

రెండు రోజుల రెడ్ అలెర్ట్

● అల్పపీడనం ఏర్పడే అవకాశం : ఐఎండీ

అడయార్, మే 19: భారత వాతావరణ శాఖ రాష్ట్రానికి రెండు రోజుల పాటు రెడ్ అలెర్ట్ జారీచేసింది. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఇది వాయువ్య దిశగా పయనించి మే 24వ తేదీకి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా వేసవి ఎండలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిల్లో నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజులు ఈ నెల 21వ తేదీ వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడన ప్రభావం కారణంగా ఈ నెల 21 వరకు రాష్ట్రానికి భారీ వర్ష సూచన ఉందని హెచ్చరించింది. ఇందులో భాగంగా 20వ తేదీ సోమవారం కన్నియాకుమారి, తిరునెల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాలకు భారీ వర్షాలు పడతాయంటూ ఆ జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. విరుదునగర్, దిండిగల్, తిరుపూరు, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఒకటి రెండు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. తూత్తుక్కుడి, రామనాథపురం, మదురై, శివగంగై, పుదుక్కోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, కడలూరు, అరియలూరు, కడలూరు, పెరంబలూరు, తిరుచ్చి జిల్లాల్లో కూడా భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే, 21వ తేదీ రాష్ట్రంలోని పలు జిల్లాల సహా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ముఖ్యంగా కన్నియాకుమారి, తిరునెల్వేలి, తెన్‌కాశి, తేని జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, విరుదునగర్, దిండిగల్, తిరుపూరు, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.



వాల్పారై సమీపంలో అట్టకట్టి ఘాట్‌రోడ్డులో జారిపడిన బండరాళ్లు

డెల్టా జిల్లాల్లో వర్షాలు

● ఆగిన చేపల వేట

బాహ్య ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా డెల్టా జిలాల్లో ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. దీంతో సముద్రతీర ప్రాంతాల్లోని జాలర్లు ఆదివారం జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు. దక్షిణ తమిళనాడులోని కొన్ని జిల్లాల్లో ఆదివారం ఉదయం చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. వేదారణ్యం, కొడియక్కరై తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అలాగే, మైలాడుదురై జిల్లాలో మైలాడుదురై, కుత్రాలం, కొల్లిడం, శీర్గాళి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. తిరువారూరు జిల్లాలో మన్నార్‌కుడి, తిరుత్తురైపూండిలో శనివారం భారీ వర్షం కురిసింది. పుదుక్కోట జిల్లాలో పుదుకోట, అరంతాంగి, ఆలంకుడి, మీమీసల్, విరాలిమలై, కీరనూరు ప్రాంతాల్లో శనివారం రాత్రి 7 గంటల నుంచి 8 గంటలకు భారీ వర్షం కురిసింది. తిరుచ్చితో పాటు మరికొన్ని డెల్టా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో జాలర్లు చేపల వేటకు వెళ్లలేదు. గత మూడు రోజులుగా దాదాపు 10 వేల మంది జాలర్లు తమ ఇళ్ళకే పరిమితమయ్యారు.

కాంచీపురంలో భారీ వర్షం

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. కాంచీపురం, ఓరిక్కై, చిన్న కాంచీపురం, నత్తంపేట, పెరియార్‌నగర్, ఒలిముహమ్మద్‌పేట, గోవిందవాడి, అగరం, ఈంజంబాక్కం, పరందూరు,ఏనత్తూరు, ఉత్తిరమేరూరు, వాలాజాబాద్ తదితర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ భారీగా వర్షాలు కురిశాయి. దీనితో ఆ ప్రాంతాల్లోని రహదారులు జలమయమయ్యాయి. వాహనాలన్నీ నత్తనడక నడిచాయి.



కాంచీపురంలో వాననీటిలో తడుస్తూ సైకిల్‌పై వెళుతున్న యువకుడు

సీఎం స్టాలిన్ ఇంట్లో చొరబాటు యత్నం

● తాగుబోతు అరెస్టు

ప్యారీస్, మే 19: స్థానిక ఆళ్వార్‌పేట చిత్తరంజన్ వీధిలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ నివాసంలోకి చొరబడేందుకు ప్రయత్నించిన ఓ తాగుబోతు యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బైకుపై సీఎం స్టాలిన్ నివాసానికి శనివారం అర్ధరాత్రి వెళ్లిన ఓ యువకుడు మత్తులో తూలుతూ ఉండడం గమనించిన భద్రతా విభాగం అధికార్లు, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా రామనాథపురం జిల్లాకు చెందిన సంతోష్ అని తెలిసింది. తనలాగా ఇంకెవ్వరూ మద్యానికి బానిస కాకూడదని తెలిపేలా ముఖ్యమంత్రిని కలుసుకుని వినతిపత్రం అందజేసేందుకు వచ్చానని సంతోష్ తెలియజేయడంతో పోలీసులు దిగ్ర్భాంతికి గురయ్యారు. ఆ తరువాత సంతోష్‌ను తేనాంపేట పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం బెయిలుపై విడుదల చేశారు. సంతోష్ నడిపిన బైకు కొళత్తూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ పాండ్యరాజన్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న అరుణ్‌కు చెందినదని తెలిసింది.

బస్సులో పేలిన తుపాకి !

● కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రం సెక్యూరిటీ గార్డ్ మృతి

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న బస్సులో ఏకే -47 తుపాకీ పేలి కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రం సెక్యూరిటీ గార్డ్ మృతి చెందారు. ఆ తుపాకీ ప్రమాదవశాత్తూ పేలిందా? లేక ఆ సెక్యూరిటీ గార్డ్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడా? అనే కోణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అణువిద్యుత్ కేంద్రం వద్ద కేంద్ర పారిశ్రామికదళం షిఫ్ట్ పద్ధతిలో ఏకే -47 తుపాకులతో కాపలా కాస్తుంటారు. ఈ దళంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన రవికిరణ్ (37) కూడా ఇతర సభ్యులతో కలిసి అణువిద్యుత్ కేంద్రం వద్ద విధుల్లో పాల్గొనేవాడు. శనివారం రాత్రి రవికిరణ్ డ్యూటీకి వెళ్ళారు. ఈ నేపథ్యంలో ఆదివారం వేకువజాము డ్యూటీ ముగించుకుని అణువిద్యుత్ కేంద్రం ఉద్యోగులు నివసించే ప్రాంతానికి సిబ్బంది, ఇతర సెక్యూరిటీ సభ్యులతో బస్సులో బయలుదేరాడు. ఆ సమయంలో అందరూ తమ తుపాకులు పెట్టుకుని ఉన్నారు. ఆ బస్సు చదురంగపట్టినం డచ్ కోట సమీపంలో వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ దాటినప్పుడు కుదుపులు కావటంతో రవికిరణ్ చేతిలోని తుపాకీ పేలంది. తూటాలు రవికిరణ్ మెడలో దూసుకెళ్ళి తల గుండా బయటకు వచ్చాయి. దీంతో అక్కడికక్కడే ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనను చూసి బస్సులో ప్రయాణిస్తున్న వారంతా దిగ్ర్భాంతికి గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న కల్పాక్కం, చదురంగపట్టినం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని రవికిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉన్నతాధికారులు రవికిరణ్ వద్దనున్న ఏకే -47 తుపాకీని పరిశీలించగా, అందులో మరికొన్ని తూటాలున్నట్లు గుర్తించారు.. సాధారణంగా భద్రతా దళం డ్యూటీలో ఉన్నప్పుడు మాత్రమే తుపాకిలో తూటాలు లోడ్ చేస్తారు. డ్యూటీ ముగిసిన తర్వాత తూటాలను తీసి తమ బెల్టు సంచుల్లో దాచిపెడతారు. రవికిరణ్ తుపాకీ నుంచి తూటాలు తీయకపోవడం పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రవికిరణ్ తుపాకీలో తూటాలున్న విషయం మరచిపోవటంతో బస్సు స్పీడ్ బ్రేకర్ దాటేటప్పుడు తుపాకీ పేలిందా? లేక రవికిరణ్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యచేసుకున్నాడా? అనే కోణాలపై కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఉన్నతాధికారులు, చదురంగపట్టినం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. తుపాకీ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన రవికిరణ్ యేడాది క్రితమే బదిలీపై కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రానికి వచ్చారని, ఆయనకు అణుషా అనే భార్య, హస్విని, రిత్తిక అనే ఇద్దరు కుమార్తెలున్నారని అధికారులు తెలిపారు.





రక్తపు మడుగులో పడి ఉన్న రవికిరణ్ మృతదేహం, రవికిరణ్ (ఫైల్‌ఫొటో)



శోకతప్తులైన సహోద్యోగులు

సిప్కాట్ డంపింగ్‌యార్డులో అగ్నిప్రమాదం

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సిప్కాట్ డంపింగ్ యార్డులో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ డంపింగ్ యార్డులో రసాయన వ్యర్థాలనే అధికంగా పారవేస్తుంటారు. మధ్యాహ్నం ఉన్నట్టుండి ఆ చెత్త కుప్పల నుంచి మంటలు చెలరేగి క్షణాల్లో ప్రాంతమంతటా దట్టమైన పొగలు అల



ప్రాంతం అంతటా దట్టమైన పొగలు వ్యాపించాయి. రసాయన పదార్థాలకు నిప్పంటుకోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం గురించి తెలియగానే అగ్ని మాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో వెళ్ళి మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ ప్రమాదం కారణంగా సిప్కాట్ ముకోవడంతో స్థానికులకు ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడ్డారు. కొందరికి కళ్ళల్లో మంటలు కూడా పుట్టాయి. గుమ్మిడిపూండి సిప్కాట్ పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ఓపీఎస్‌ను చేర్చుకునే ప్రసక్తే లేదు

● అన్నాడీఎంకే నేత ఆర్బీ ఉదయకుమార్



సేడపట్టి వద్ద అన్నదానం చేస్తున్న ఆర్బీ ఉదయకుమార్

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): పార్టీలో చీలికలు తెచ్చేందుకు కుట్రలు పన్నిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్)ను ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్ళీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని అన్నాడీఎంకే శాసనసభాపక్ష ఉప నాయకుడు, మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ స్పష్టం చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి 70వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం మదురై జిల్లా సేడపట్టి వద్ద ఆయన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మహేంద్రన్, కే తవసి, అమ్మాపేరవై డిప్యూటీ కార్యదర్శి దురైధనరాజన్, ఎంజీఆర్ మండ్రం డిప్యూటీ కార్యదర్శి రామకృష్ణన్, మదురై జిల్లా కోశాధికారి తిరుప్పది తదితరులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆర్బీ ఉదయకుమార్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఓపీఎస్‌ను పార్టీలో చేర్చుకునే అవకాశాలున్నాయంటూ ప్రత్యర్థులు ప్రసార మాధ్యమాల్లో పుకార్లు పుట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీఎస్ పదవుల కోసం ప్రాకులాడే వ్యక్తి అని, పదవి పోయిందన్న భయంతోనే పార్టీని రెండుగా చీల్చేందుకు శ్రీకారం చుట్టారని, పార్టీ చిహ్నం రెండాకుల గుర్తును స్తంభింపజేయడానికి న్యాయస్థానాల్లో అదే పనిగా పిటిషన్లు కూడా వేశారని, పార్టీకి ఇలా అడుగడుగునా తీరని ద్రోహం చేసిన ఆయనను పార్టీలో ఎలా చేర్చుకుంటామని ప్రశ్నించారు. తనకు పేరు ప్రఖ్యాతులు, పదవులు కల్పించిన అన్నాడీఎంకేకు వ్యతిరేకంగా రామనాథపురం నియోజకవర్గంలో ఓపీఎస్ పోటీ చేయడం పార్టీకి ద్రోహం చేయడమే అవుతుందన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకేలో అసమ్మతి వర్గాలు లేవని, అందరూ ఎడప్పాడికి అండగా ఉంటున్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ఆయన తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఉదయకుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ పొత్తుకోసం తహతహలాడిందని, కేంద్రంలో మంత్రి పదవులిస్తామని, గవర్నర్ పదవులు ఇస్తామని ఆశ చూపిందని ఆయన ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు అన్నామలైకి రాజకీయ అనుభవం శూన్యమని ఎద్దేవా చేశారు. తమిళ భాష, సంస్కృతీ సంప్రదాయాలు అన్నామలైకి తెలియవని విమర్శించారు.

సమాచార దర్శిని

అదనంగా 610 టీచర్ పోస్టులు

ఐసిఎఫ్, మే 19: ఇదివరకే ప్రకటించిన పోస్టులతో పాటు అదనంగా 610 పోస్టులు చేర్చినట్లు టీఆర్బీ కార్యదర్శి రామేశ్వర మురుగన్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2,582 టీచర్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరిలో టీఆర్బీ రాతపరీక్ష నిర్వహించింది. త్వరలో ఉత్తీర్ణులైన వారి వివరాలు విడుదల చేయనుంది. ప్రస్తుతం మరో 610 ఖాళీ పోస్టులు చేర్చిన టీఆర్బీ త్వరలో అభ్యర్థులను ప్రకటించనుంది.

నేడు వరదరాజ స్వామి వైకాశి బ్రహ్మోత్సవాలు

ఐసిఎఫ్, మే 19: స్థానిక తిరువొత్తియూర్ కాలడి పేట కల్యాణ వరదరాజ పెరుమాళ్ ఆలయ వైకాశి బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. రాత్రి శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారు చంద్రప్రభ వాహనంలో దర్శనమివ్వనున్నారు. ప్రధాన కార్యక్రమమైన గరుడ సేవ 22వ తేది, రథోత్సవం 26వ తేది, తీర్థవారి 28వ తేది జరుగనున్నాయి. 30 నుంచి జూన్ 3వ తేది వరకు విడయాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

రూ.100తో రోజంతా మెట్రో ప్రయాణం

పెరంబూర్, మే 19: నగరంలో నడుస్తున్న మెట్రో రైళ్లలో రూ.100 చెల్లించి రోజంతా ప్రయాణించవచ్చని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. వారాంతపు రోజుల్లో 'ఒక రోజు ట్రావెల్ కార్డు' అందజేయనున్నట్లు, ప్రయాణికులు మెట్రో రైల్వేస్టేషన్‌లోని టిక్కెట్టు కౌంటర్ల వద్ద రూ.150 చెల్లించి ట్రావెల్ కార్డు పొందవచ్చన్నారు. ఈ కార్డు వినియోగించి రోజులో ఎన్ని సార్లైనా ప్రయాణించవచ్చని, ఆఖరున కార్డు కౌంటర్లలో ఇచ్చి రూ.50 తిరిగి పొందవచ్చని సీఎంఆర్ఎల్ తెలిపింది.

చదురగిరి కొండకు భక్తుల నిషేధం

పెరంబూర్, మే 19: విరుదునగర్ జిల్లాలోని పశ్చిమ కనుమల కొండల్లోని చదురగిరి కొండ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు నిషేధం విధించారు. ఈ నెల అమావాస్య, ప్రదోషం సందర్భంగా 20 నుంచి 24వ తేది వరకు కొండ ఆలయానికి భక్తులను అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ఇదివరకే ప్రకటించింది. కాగా, ప్రస్తుతం పశ్చిమ కనుమలఓల్లో భారీవర్షాలు కురుస్తుండడంతో ఆలయ మార్గానికి వెళ్లే మార్గంలో నీటి ప్రవాహం అధికమైంది. దీంతో కొండ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు నిషేధం విధిస్తున్నట్లు జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

నేటితో ముగియనున్న దరఖాస్తు నమోదు

ఐసిఎఫ్, మే 19: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల చేరికకు దరఖాస్తు నమోదు సోమవారంతో ముగియనుంది. 164 ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లకు ఈ నెల 6వ తేది ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. శనివారం వరకు 2,14,338 దరఖాస్తులు స్వీకరించారు. వారిలో 1,68,389 మంది దరఖాస్తు రుసుము చెల్లించారు. ఈ దరఖాస్తు స్వీకరణ గడువు సోమవారం ముగియనుంది.

తిరుచెందూర్ తీరంలో స్నానాలకు నిషేధం

పెరంబూర్, మే 19: తిరుచెందూర్ సముద్రతీరంలో స్నానాలపై ఆలయ అధికారులు నిషేధం విధించారు.. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి వచ్చే భక్తులు సమీపంలోని సముద్రతీరంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటుంటారు. ప్రస్తుతం ఇక్కడి సముద్రంలో జెల్లీ చేపలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. ఇవి శరీరానికి తగిలితే అలర్జీ, చర్మ సంబంధిత సమస్యలు ఏర్పడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. భక్తుల ఆరోగ్యం దృష్ట్యా సముద్రతీరంలో భక్తులు స్నానాలు చేసేందుకు ఆలయ నిర్వాహకులు నిషేధం విధించారు. కాగా, భక్తులు తీరంలో స్నానాలు చేయకుండా పాదాలు తడుపుకొని వెళ్లవచ్చని పోలీసులు శాఖ లౌడ్ స్పీకర్ల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నారు.

కొల్లిమలై జలపాతాల్లో స్నానాలకు నిషేధం

ఐసిఎఫ్, మే 19: నామక్కల్ జిల్లా కొల్లిమలై జలపాతాల్లో స్నానాలకు అధికారులు నిషేధం విధించారు. పర్యాటక స్థలమైన ఇక్కడకు సందర్శకులు వస్తుంటారు. కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలపాతాల్లో ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో పర్యాటకుల భద్రత దృష్ట్యా స్నానాలకు అధికారులు నిషేధం విధించారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 1.69 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 19: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్లకు 1.69 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సాంకేతిక విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు స్వీకరణ ఈ నెల 6వ తేది నుంచి ప్రారంభమైందన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 1,69,486 మంది దరఖాస్తులు సమర్పించారని, వారిలో 1,17,596 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 78,467 మంది తమ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారని తెలిపారు. గత ఏడాది 2,2,8,122 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది దరఖాస్తుల మరింత పెరిగే అవకాశముందని, దరఖాస్తు సమర్పణకు జూన్ 6వ తేది చివరి రోజని డైరెక్టరేట్ తెలిపింది.

నాగపట్టణం-శ్రీలంక నౌకాయానం తాత్కాలిక రద్దు

పెరంబూర్, మే 19: నాగపట్టణం-శ్రీలంక మధ్య నౌకాయానం తాత్కాలికంగా రద్దయింది. నాగపట్టణం నుంచి శ్రీలంకలోని కాంగేశన్ హార్బర్‌కు గత ఏడాది అక్టోబరు 14వ తేది నుంచి ప్రయాణికుల నౌక సేవలు ప్రారంభం కాగా, రుతుపవనాల ప్రవేశంతో ఆ నెలలోనే నౌక సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో, ఈ నెల నుంచి నౌక సేవలు ప్రారంభించనున్నట్లు ప్రకటించగా, మూడు సార్లు వాయిదాపడింది. ఈ నేపథ్యంలో, నౌకా సేవలు అందిస్తున్న ప్రైవేటు సంస్థ విడుదల చేసిన ప్రకటనలో సముద్ర రవాణా నిబంధనలు కఠినతరం, వాతావరణంలో మార్పుల కారణంగా నౌక సేవలు ప్రారంభించడం సాధ్యం కాలేదని, ఈ సేవల ప్రారంభంపై త్వరలో ప్రకటన విడుదల చేస్తామని సదరు సంస్థ తెలియజేసింది.

పెంపుడు జంతువుల లైసెన్స్‌కు కొత్త యాప్

ఐసిఎఫ్, మే 19: గృహాల్లో పెంచుకొనే పెంపుడు జంతువులకు లైసెన్స్ నమోదుకు తాంబరం కార్పొరేషన్ కొత్త యాప్ పరిచయం చేసింది. ఈ యాప్‌లో సోమవారం నుంచి రెండు రోజులు ప్రయోగాత్మకంగా తాంబరం కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉన్న వారు పిల్లలు, శునకాలు లైసెన్స్ నమోదుచేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుదారులు రూ.50 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే యాప్‌ను అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేయనున్నామని వెల్లడించారు.

ఘనంగా వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘం వార్షికోత్సవం



వార్షికోత్సవ సావనీర్ ఆవిష్కరిస్తున్న సీనియర్ పాస్టర్ పాల్ ఈశ్వరప్ప, అల్లూరి సత్యవర్మ తదితరులు

ప్యారీస్, మే 19: స్థానిక పెరంబూర్ కుక్స్ రోడ్డులో ఉన్న వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘం 137, 138వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘ సీనియర్ పాస్టర్ రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో కార్యదర్శి జి.నాగేశ్వరరావు, ఖజానాదారుడు ఎన్.పాల్ నాగేశ్వరరావు వార్షికోత్సవ నివేదికలు సమర్పించారు. సహాయ కాపరులు రెవ.డా. పి.మదన్‌మోహన్, రెవ.డి.ఆరోన్‌దయాన్, ఉపాధ్యక్షుడు బీఎస్ జీవన్‌బాబు, స్త్రీల సమాజం, సండే స్కూలు, గాస్పల్ వింగ్, యువజన విభాగాలకు చెందిన నిర్వాహకులు, సభ్యులు, నగరంలోని ఎంసీటీబీసీ సహా పలు తెలుగు బాప్టిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని జర్నీ విత్ జీసస్ ఫౌండేషన్ నిర్వాహకులు అల్లూరి సత్యవర్మ ఆత్మీయ అతిథిగా పాల్గొని దైవసందేశం అందించారు. ముందుగా కార్యక్రమంలో సంఘకాపరి పాల్ ఈశ్వరప్ప ఆవిష్కరించిన 137,138వ వార్షికోత్సవ ప్రత్యేక సావనీర్‌ను సభ్యులందరికీ అందజేసి విందు ఏర్పాటుచేశారు.

ఎయిమ్స్ నిర్వహణ కమిటీ సభ్యుడిగా కామకోటి

ఐసిఎఫ్, మే 19: మదురై ఎయిమ్స్ నిర్వహణ కమిటీ సభ్యుడిగా చెన్నై ఐఐటీ డైరెక్టర్ కామకోటి నియమితులయ్యారు. మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని తోపూరులో కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ ఆసుపత్రి రూ.1,977.8 కోట్లతో నిర్మిస్తుంది. నిర్మాణపనులు చేపడుతున్న ఎల్ అండ్ టీ సంస్థ 33 నెలల్లో పనులు పూర్తిచేయనుంది. ఈ నేపథ్యంలో, ఎయిమ్స్ నిర్వహణ కమిటీ సభ్యుడిగా చెన్నై ఐఐటీ ఉన్నత విద్య సంస్థ డైరెక్టర్ కామకోటి నియమితులయ్యారు.

350 పాఠశాలల వాహనాల తనిఖీ

ఐసిఎఫ్, మే 19: స్థానిక తాంబరం పరిధిలోని ప్రాంతాల్లో 350 పాఠశాలల వాహనాలు తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. తాంబరం, ముడిచూర్, మన్నివాక్కం, సేలయూరు, క్రోంపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న 70 పాఠశాలలకు చెందిన 506 వాహనాలకు ఇదివరకే లైసెన్స్ ఇచ్చారు. ఈ వాహనాల తనిఖీ పడప్పై సమీపంలోని క్రీడా మైదానంలో శనివారం జరిగింది. తొలివిడత తనిఖీల్లో 350 వాహనాల్లో 344 వాహనాలు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. చిన్న చిన్న లోపాలున్న 6 వాహనాలను ఈ నెల 24వ తేది మళ్లీ తనిఖీ చేయనున్నట్లు వారు తెలిపారు.

చెట్‌పెట్ రైల్వేస్టేషన్‌తో మెట్రో అనుసంధానం

ఐసిఎఫ్, మే 19: స్థానిక చెట్‌పెట్ రైల్వేస్టేషన్‌తో 16 మీటర్ల లోతులో ఏర్పాటవుతున్న మెట్రో రైల్వేస్టేషన్ అనుసంధానిస్తున్నారు. నగరంలో రెండో విడతగా లైట్ హౌస్-పూందమల్లి, మాధవరం-షోలింగనల్లూర్, మాధవరం-సిప్కాట్ మూడు మార్గాల్లో 116 కి.మీ మెట్రో మార్గం, రైల్వేస్టేషన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో మాధవరం-సిప్కాట్ మార్గంలో 45 కి.మీలో మూలకడై, పెరంబూర్, అయనావరం, పురుషవాక్కం, చెట్‌పెట్, నుంగంబాక్కం సహా 50 రైల్వేస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. సుమారు 16 మీటర్ల లోతులో ఏర్పాటవుతున్న ఈ మెట్రో మార్గం చెట్‌పెట్ రైల్వేస్టేషన్‌తో అనుసంధానం చేయనున్నారు.

532 బస్టాండ్లలో డిజిటల్ బోర్డులు

పెరంబూర్, మే 19: నగరంలోని తొలివిడతగా 532 బస్టాండ్లలో బస్సుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డులు ఏర్పాటుకానున్నాయి. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఎంటీసీ) నగరం, శివారు ప్రాంతాలు కలిపి 659 మార్గాల్లో ప్రతి రోజు 3,436 బస్సులు నడుపుతుండగా, సుమారు 35 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. సెంట్రల్ రైల్వేస్టేషన్, రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రి, కోయంబేడు తదితర బస్టాండ్‌లో బస్సులు వచ్చే సమయంతో కూడిన డిజిటల్ బోర్డులు ఏర్పాటుచేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం తొలివిడతగా 532 బస్టాండ్లలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు, పల్లవన్ రోడ్డులోని ఎంటీసీ కార్యాలయం నుంచి వీటిని పర్యవేక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

సహకార బ్యాంకుల్లోనూ వాహన రుణాలు

ఐసిఎఫ్, మే 19: సహకార బ్యాంకుల్లో తొలిసారిగా బైక్, కారు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లకు రుణాలు అందజేయాలని బ్యాంక్ అధికారులకు సహకార శాఖ ఆదేశించింది. ఈ శాఖ ఆధ్వర్యంలోని సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ రుణ సంఘాల్లో పంటలు, నగలు వివిధ విభాగాల్లో రుణాలు అందజేస్తున్నారు. 2023-24లో అన్ని విభాగాల్లో కలిపి రూ.82,000 కోట్ల రుణాలు అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.03 లక్షల కోట్ల రుణాలు అందజేయాలని బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లకు సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. తొలిసారిగా కారు, బైక్ వంటి వాహనాలు, అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేసేందుకు, పింఛన్‌దారులకు గృహాలతో పాటు తాకట్టుపేరున రుణాలు అందజేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

వాట్సాప్ ద్వారా విద్యార్థుల సంక్షేమ పథకాలు

ఐసిఎఫ్, మే 19: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులందించే సంక్షేమ పథక సహాయాలకు సంబంధించిన వివరాలను వారి తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా తెలియజేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. పాఠశాల విద్యా డైరెక్టర్, ప్రాథమిక విద్యా డైరెక్టర్‌కు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమరగురుపరన్ పంపిన లేఖలో... ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు 14 రకాల సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని, ఆ వివరాలను తల్లిదండ్రులకు వారి మొబైల్ నెంబర్ల ద్వారా చేరవేయాలని పేర్కొన్నారు. ఇప్పటివరకు 35 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లు సేకరించామని, వేసవి సెలవుల అనంతరం విద్యార్థులకు ఉచిత వస్తువులు అందజేయాలని పేర్కొన్నారు.

రూ.20 కోట్లతో శునక జాతి నియంత్రణ కేంద్రాలు

ఐసిఎఫ్, మే 19: 'సింగార చెన్నై 2.0' పథకం కింద నగరంలోని మూడు ప్రాంతాల్లో రూ.20 కోట్లతో ఏర్పాటుచేసిన శునకాల జాతి నియంత్రణ కేంద్రాలు జూలైలో అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు. నగరంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల పెంపుడు శునకాలు కూడా పెరగడంతో వాటి నియంత్రణ, పర్యవేక్షణపై చెన్నై కార్పొరేషన్ ప్రత్యేక నిబంధనలు సూచించింది. ఇదివరకే పులియాంతోపు, లాయడ్స్ కాలనీ, కన్నమ్మ పేట ప్రాంతాల్లో శునకాలకు జాతి నియంత్రణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఏడాదికి వీటిలో సుమారు 16,000 శునకాలకు శస్త్రచికిత్స చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లోనే రూ.20 కోట్లతో మూడు ఆధునిక జాతి నియంత్రణ శస్త్రచికిత్సా కేంద్రాలను సింగార చెన్నై 2.0 పథకం కింద ఏర్పాటుచేశారు. వీటిలో ఏడాదికి 27,000 శునకాలకు జాతి నియంత్రణ శస్త్రచికిత్స చేయనున్నట్లు, ఈ కేంద్రాలు జూలైలో పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

రెండు వేల పెంపుడు శునకాలకు లైసెన్స్

పెరంబూర్, మే 19: నగరంలో 2,000 శునకాలకు లైసెన్స్ మంజూరు చేసినట్లు చెన్నై కార్పొరేషన్ వెటర్నరీ వైద్యం డైరెక్టర్ కమల్‌హాస్సేన్ తెలిపారు. థౌజండ్ లైట్స్ ప్రాంతంలోని పార్క్‌లో ఆడుకుంటున్న 5 ఏళ్ల బాలికపై రెండు పెంపుడు శునకాలు దాడిచేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో, నగరంలో పెంపుడు శునకాలకు లైసెన్స్ తప్పనిసరని, లైసెన్స్ లేని శునకాల యజమానులపై చర్యలు చేపడతామని చెన్నై కార్పొరేషన్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ విషయమై కార్పొరేషన్ వెటర్నరీ డైరెక్టర్ కమల్‌హాస్సేన్ మాట్లాడుతూ... ఇప్పటివరకు 2,000 పెంపుడు శునకాలకు లైసెన్స్ అందజేశామని, మరో 2,700 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రజలు తగిన పత్రాలతో దరఖాస్తు చేసుకొంటే మూడురోజుల్లో లైసెన్స్ అందజేస్తామని ఆయన తెలిపారు.

మరో మూడు రోజుల పాటు ఊటీ రోజ్ ఫ్లవర్ షో

పెరంబూర్, మే 19: పర్యాటకుల రద్దీ అధికంగా ఉండడంతో ఊటీలో గులాబీల ప్రదర్శన మరో మూడు రోజులు పొడిగించారు. నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్క్‌లో 19వ గులాబీ పుష్పాల ప్రదర్శన ఆదివారంతో ముగిసిన నేపథ్యంలో, మరో మూడు రోజుల పాటు పొడిగించి ఈ నెల 22 వరకు ఉంటుందని ఉద్యానవనాల శాఖ ప్రకటించింది. ఈ ప్రదర్శనలో వివిధ రంగుల్లో సుమారు లక్షకు పైగా గులాబీలు ప్రదర్శనకు ఉంచారు. ఆదివారం వరకు 70,000 మంది ప్రదర్శనను సందర్శించినట్లు అధికారులు తెలిపారు.

మెరీనా తీరం.. జనసంద్రం..



అకాలవర్షంతో వాతావరణం చల్లబడటంతో మెరీనాబీచ్ లైట్‌హౌస్ వద్ద నగరవాసుల సందడి

మేట్టూరు డ్యాం నీటి విడుదల పెంపు

పెరంబూర్, మే 19: మేట్టూరు డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు విడుదల చేసే నీటిని 2,100 ఘనపుటడుగులకు పెంచారు. ఈ డ్యాం పూర్తి సామర్థ్యం 120 అడుగులు. కావేరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంలోకి 207 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, శనివారం సాయంత్రానికి 137 ఘనపుటడుగులకు తగ్గింది. డ్యాం నుంచి కావేరి తీరప్రాంత జిల్లాలకు ఈ నెల 7వ తేది నుంచి 1,500 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తుండగా, తాగునీటి అవసరాలు పెరగడంతో శనివారం నుంచి నీటి విడుదల 2,100 ఘనపుటడుగులకు పెంచారు. ప్రస్తుతం డ్యాంలో 49.95 అడుగులు (17.78 టీఎంసీ) నీటి నిల్వలున్నాయి.

కిలంబాక్కం నుంచి 1.76 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, మే 19: శుభముహూర్తాలు, వారాంతపు సెలవు రోజులు కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు నడిపింది. శుక్రవారం 1,618 బస్సుల్లో 84,936 మంది, శనివారం 1,753 బస్సుల్లో 91,156 మంది అని రెండు రోజుల్లో మొత్తం 3,771 బస్సుల్లో సుమారు 1.76 లక్షల మంది ప్రయాణించారు. ముఖ్యంగా తిరువణ్ణామలై, విల్లుపురం, తంజావూరు, తిరుచ్చి, కుంభకోణం ప్రాంతాలకు అదనపు బస్సులు నడిపారు. శనివారం అర్ధరాత్రి రెండు గంటల వరకు ప్రయాణికులు వేచి ఉండి తమ ప్రాంతాలకు వెళ్లారు. అలాగే, స్వగ్రామాలకు వెళ్లిన వారు నగరానికి తిరిగొచ్చేలా ఆదివారం ప్రత్యేక బస్సులు నడిపినట్లు ఎస్ఈటీసీ అధికారులు తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు శీతల పానీయాల పంపిణీ



కార్మికులకు శీతల పానీయాలు అందజేస్తున్న సంగీత

వేలూరు, మే 19: గుడియాత్తం గోపాలపురంలో గత వారం గంగమ్మ ఆలయ శిరస్సు వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా ఏర్పడిన వ్యర్థాలను తొలగించేందుకు మూడు రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు శ్రమిస్తున్నారు. కార్మికులకు పుదియ నీది పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం సూచనలతో 5 వేల శీతల పానీయాలను ఆ పార్టీ మహిళా శాఖ మండల జాయింట్ సెక్రటరీ సంగీత అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నగర సెక్రటరీ ఎస్.రమేష్, ఐటీ వింగ్ మండల సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ సహా కార్యకర్తలు పాల్గొన్నారు.

పూందమల్లి-పోరూర్ మధ్య చురుకుగా సాగుతున్న మెట్రోరైలు పనులు

ప్యారీస్, మే 19: మెట్రోరైలు రెండో పథకంలో పూందమల్లి-పోరూమ్ మధ్య విద్యుత్ పరికరాలు ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు. రాజధాని నగరంలో ప్రస్తుతం నడుపుతున్న మెట్రోరైళ్లకు విశేష స్పందన లభించింది. ఈ రైళ్ల సేవలను నగరం నలుమూలలకు విస్తరించాలని భారీ ప్రణాళిక రూపొందించారు. రెండో విడత పథకం కోసం కేటాయించిన రూ.61,843 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. దక్షిణ చెన్నై పరిధిలోని పూందమల్లి నుంచి మైలాపూర్ సమీపంలోని లైట్ హౌస్ వరకు మెట్రోరైలు మార్గం నిర్మిస్తున్నారు.. ఇందులో పూందమల్లి నుంచి పోరూర్ వరకు సిద్ధమవుతున్న మార్గంలో 2025 డిసెంబరు నాటికి రైళ్ల సేవలు ప్రారంభించాలన్న లక్ష్యంతో సీఎంఆర్ఎల్ ముందుకు కదులుతోంది. ఈ మార్గంలో స్తంభాలపై నిర్మించిన మార్గంలో విద్యుత్ పరికరాలను బిగిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 500 విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాల్సి ఉండగా ఇప్పటివరకు 200 స్తంభాలు వేసి వాటికి విద్యుత్ కనెక్షన్ జతచేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు మెట్రోరైలు పనుల్లో పాల్గొంటున్న వలస కార్మికుల్లో 50 శాతం మందికి పైగా సొంతూళ్లకు వెళ్లడంతో పనుల్లో కొంత జాప్యం ఏర్పడిందని, జూన్ 4 అనంతరం కార్మికులు తిరిగొచ్చాక మళ్లీ పనులు వేగవంతం చేయనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన చెత్త



వసంతాపురం బ్రిడ్జి సమీపంలోని కాలువలో వ్యర్థాలు

వేలూరు, మే 19: స్థానిక వసంతాపురం బ్రిడ్జి సమీపంలోని మురిగునీటి కాలువలో వ్యర్థాలు తొలగించకపోవడంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువలో థర్మోకోల్ పలకలు, ట్యూబ్‌లైట్లు, చాపలు, దిండ్లు సహా పలు వస్తువులు వేస్తున్నారు. వీటిని తొలగించకపోవడంతో కాలువ దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల ఉత్పత్తి కూడా అధికమైంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

టెన్త్ జవాబుపత్రాల కోసం నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

ప్యారీస్, మే 19: రాష్ట్రంలో టెన్త్, ప్లస్ వన్ పబ్లిక్ పరీక్ష రాసిన విద్యార్థులు రీ అడిషినల్ కాపీ పొందేందుకు సోమవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రకటించింది. ఇటీవల విడుదలైన టెన్త్, ప్లస్ వన్ పరీక్షా ఫలితాల్లో అధిక మార్కులు రాని వారు ఆన్సర్ షీట్ కాపీ పొందేందుకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 18న ప్రారంభ సోమవారంతో ముగియనుంది. జవాబు పత్రం కాపీని పొందడానికి అన్ని సబ్జెక్టులకు రూ.275 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బయాలజీ సబ్జెక్ట్ రూ.305, ఇతర సబ్జెక్టులకు రూ.200 రుసుము చెల్లించాలి. విద్యార్థులు సమాధానం పత్రం కాపీ తిరిగి పంపేటప్పుడు జారీ చేయబడిన రసీదు స్లిప్ భద్రంగా ఉంచుకోవాలని, అప్పుడే మార్కుల వివరాలు తెలుసుకోవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రైలు ఢీకొని మూడు జింకల మృతి



మృతిచెందిన జింకలు

వేలూరు, మే 19: అరక్కోణం రైల్వేస్టేషన్ సమీపంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మూడు జింకలు మృతిచెందాయి. ఈ రైల్వేస్టేషన్ సమీపంలోని అడవుల నుంచి నీటి కోసం జంతువులు వస్తుంటాయి. రాత్రి వేళ జంతువులు రైలుపట్టాలు దాటుతుంటాయి. ఈ నేపథ్యంలో, రైలుపట్టాలు దాటేందుకు యత్నించిన మూడు జింకలు రైలు ఢీకొని మృతిచెందాయి. జింక కళేబరాలు గుర్తించిన వందే భారత్ రైలు పైలెట్ అరక్కోణం రైల్వే పోలీసులకు సమాచారమిచ్చాడు. భానావరం అటవీ శాఖ సిబ్బంది, వెటర్నరీ వైద్యులు అక్కడకు చేరుకొని జింకల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించి, సమీపంలోని అడవిలో అంత్యక్రియలు నిర్వహించారు.



వేలూరు తంథై పెరియార్ కళాశాలలో ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌ను ఆదివారం పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

బాలికలతో వ్యభిచారం ...
మహిళా బ్రోకర్ అరెస్టు

● పోక్సో చట్టం కింద ఇద్దరి అరెస్టు

అడయార్, మే 19: తన కుమార్తె ద్వారా యువతులను ఇంటికి రప్పించి, వారికి డబ్బు ఆశ చూపి వ్యభిచార వృత్తిలోకి దింపుతున్న ఒక మహిళా బ్రోకర్ సహా ఆమె కుటుంబ సభ్యులందరినీ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. చెన్నై కేంద్ర వ్యభిచార నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ సెల్వరాణికి అందిన సమాచారం మేరకు ఆమె సారథ్యంలో పది మంది సభ్యులతో కూడిన ప్రత్యేక పోలీసు బృందం వలసరవాక్కం, జయ నగర్ వీధిలోని ఒక ఇంటిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, వెస్ట్‌సైదాపేటకు చెందిన రమణీధరన్ (70) అనే వ్యక్తి 17 యేళ్ళ బాలికతో సన్నిహితంగా ఉండటాన్ని గుర్తించి అరెస్టు చేశారు. ఆ బాలికను అదుపులోకి తీసుకున్నారు. రమణీధరన్‌ను విచారించగా టి.నగర్ డాక్టర్ థామస్ రోడ్డుకు చెందిన బ్రోకర్ నదియ (37) అనే మహిళ, తేనాంపేట టీటీకే రోడ్డుకు చెందిన ఆమె సోదరి సుమతి (43)లకు రూ.25 వేల చెల్లించి ఆ బాలికను పిలిపించుకున్నట్టు వెల్లడించారు. ఆ తర్వాత ఇద్దరు మహిళా బ్రోకర్లను అరెస్టు చేశారు. తనసోదరి, భర్త రామచంద్రన్ (47)తో కలిసి నదియ గత యేడాదిగా ఈ వ్యభిచారవృత్తి చేస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అంతేకాకుండా, 12వ తరగతి చదువుతున్న నదియ కుమార్తె ద్వారా పాఠశాలలో చదువుతున్న బాలికలను ఇంటికి పిలించి, వారికి డబ్బు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి దింపినట్టు తేలింది. దీంతో నదియ, సుమతి, రామచంద్రన్, నేపాల్‌కు చెందిన యువతి మాయా ఒలి (29), అశోక్ కుమార్ (31), రమణీధరన్ (70)లను అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు వీరి నుంచి ఏడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు.

దివ్యాంగులకు కళాశాల ఫీజు నుంచి మినహాయింపు

● రాష్ట్రప్రభుత్వం సిఫారసు

పెరంబూర్, మే 19: కళాశాల ఫీజు నుంచి దివ్యాంగులకు మినహాయింపు కల్పించాలని అన్ని ఉన్నత విద్యాసంస్థలకు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.నాగరాజన్ లేఖ రాశారు. దివ్యాంగుల సంక్షేమ హక్కుల సంఘం, కళాశాలల అంధ విద్యార్థుల సంఘాలు, తమకు కళాశాల ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారన్నారు. కళాశాల ఫీజు నుంచి దివ్యాంగులకు మినహాయింపు కల్పించాలని అన్నా విశ్వవిద్యాలయం, తమిళనాడు డా.ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం సహా 23 విశ్వవిద్యాలయాలకు దివ్యాంగుల సంక్షేమశాఖ లేఖలు రాసింది.

కోడంబాక్కంలో పేకాటరాయుళ్ల అరెస్ట్

పెరంబూర్, మే 19: స్థానిక కోడంబాక్కంలో పేకాడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోడంబాక్కం సీఐ నేతృత్వంలోని పోలీసు బృందం శనివారం రాత్రి రైల్వే బార్డర్ రోడ్డులోని ఓ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాడుతున్న 14 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.50,500 నగదు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

22న తిరువణ్ణామలైలో పౌర్ణమి గిరిప్రదక్షణ

అడయార్, మే 19: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ఈ నెల 22 బుధవారం నుంచి 23 వరకు పౌర్ణమి ఘడియల్లో గిరి ప్రదక్షిణకు అనువైన సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. 22 రాత్రి 7.16 గంటలకు గిరిప్రదక్షణ ప్రారంభించి 23 రాత్రి 7.51 గంటల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అరుణాచలేశ్వర స్వామి దేవస్థాన పూజారులు వెల్లడించారు. ఈ గిరిప్రదక్షణకు తిరువణ్ణామలై వెళ్ళే భక్తుల కోసం రాష్ట్ర రవాణా శాఖ కోయంబేడు, మాధవరం, కిలాంబాక్కం, అడయారు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. అయితే, కోయంబేడు బస్టాండు నుంచి ఆర్కాడు రోడ్డు మీదుగా 44 బస్సులు, కాంచీపురం వందవాసి మీదుగా 11 డైలీ బస్సు సర్వీసులు నడుపుతుండగా, వీటికి అదనంగా మరో 30 బస్సులను నడిపేందుకు రవాణా శాఖ ఏర్పాట్లు చేసింది. కిలాంబాక్కం బస్టాండు నుంచి దిండివనం, సెంజి మీదుగా బస్సు సర్వీసులు నడుపుతామని రవాణా శాఖ వెల్లడించింది. అలాగే, ప్రతి రోజూ చెన్నై బీచ్ నుంచి తిరువణ్ణామలైకు విద్యుత్ లోకల్ రైలు సర్వీసు కూడా వెళుతుంది.

కర్రసాములో వినూత్న సాధన



కర్రసాములో బాలబాలికలు

పెరంబూర్, మే 19: పలు రకాల విన్యాసాలతో కర్రసాము చేసిన బాలబాలికలు రికార్డ్స్ పుస్తకంలో చోటు దక్కించుకున్నారు. మదురై జిల్లా తిరుమంగళంలోని అల్‌అమీన్ పాఠశాలలో శనివారం ఈ ప్రదర్శన నిర్వహించారు. 7వ తరగతి విద్యార్థి జగత్‌కిషోర్ మోకాళ్లపై కూర్చొని ఒక కర్ర, 6వ తరగతి విద్యార్థి అరుణ్‌మారన్ కాళ్లకు తాడు చుట్టుకొని, కళ్లకు గంతలు కట్టుకొని రెండు కర్రలు, 9వ తరగతి విద్యార్థిని దీపిక వీరభద్ర ఆసనంలో రెండు కర్రలు తిప్పుతుండగా, మరో విద్యార్థిని ముత్తుమీనాక్షి 15 ఆసనాలు వేశారు. ఈ వినూత్న సాధన గిన్నిస్ రికార్డ్స్‌లో నమోదుచేయాలని కోరినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏనుగు దంతాలు తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్



అరెస్టయిన నిందితుడు

పెరంబూర్, మే 19: ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల శరణాయం పరిధిలోని తాలవాడి అటవీ రేంజ్ గుండాపురం ప్రాంతంలో గత నెల గస్తీ తిరిగిన అటవీ శాఖ అధికారులు, దంతాలు పెకలించి ఉన్న మగ ఏనుగు కళేబరం లభించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అటవీ శాఖ అధికారులు, ఈ కేసుకు సంబంధించి కర్ణాటక రాష్ట్రం ఎత్తేగౌండన్‌తొట్టికి చెందిన బొమ్మన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, రెండు దంతాలు స్వాధీనం చేసుకున్నారు.ఐ

బ్రహ్మేంద్ర అధిష్టానం వద్ద ఎంగిలి అరటి ఆకులపై అంగప్రదక్షిణం



అంగ ప్రదక్షిణలో భక్తులు

పెరంబూర్, మే 19: కరూర్ జిల్లా నేరూరులో ప్రసిద్ధిచెందిన సదాశివ బ్రహ్మేంద్ర అధిష్టానం ఉంది. ఇక్కడ ప్రతి ఏటా మే నెలలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆరాధన ముగింపు రోజున అన్నదానం అనంతరం ఎంగిలి ఆకులపై భక్తులు అంగ ప్రదక్షిణం చేస్తుంటారు. ఈ వేడుకలపై దాఖలైన కేసును విచారించిన హైకోర్టు మదురై బెంచ్ వేడుకలపై స్టే విధించింది. 2015 నుంచి వేడుకలు నిర్వహించని నేపథ్యంలో, కరూర్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, వేడుకలకు అనుమతి కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు.ఎంగిలిఆకుల మొక్కులకు నిషేధంలేదని న్యాయస్థానం గురువారం ఉత్తర్వులుజారీచేసింది.శనివారం మధ్యాహ్నం అరటి ఆకులపై భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం ఎంగిలి ఆకులపై వంద మందికి పైగా భక్తులు అంగప్రదక్షిణలు చేశారు. తొమ్మిదేళ్ల అనంతరం నిర్వహించిన ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

27న పాఠశాలల పునఃప్రారంభంపై సమావేశం

ప్యారీస్, మే 19: రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను పునఃప్రారంభించడంపై ఈ నెల 27న పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల సమావేశం జరుగుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో టెన్త్, ప్లస్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి ఏప్రిల్ 8వ తేది వరకు జరిగాయి. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ఇతర తరగతులకు ముందుగానే పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 23తో అన్ని తరగతుల పరీక్షలు ముగిసిన నేపథ్యంలో, 24వ తేది నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ప్రతి ఏటా వేసవి సెలవుల అనంతరం జూన్ మొదటి వారంలో పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయి. అయితే ఈసారి జూన్ 4న పార్లమెంటు ఎన్నికల లెక్కింపు, ఫలితాలు వెల్లడి కానున్న సందర్భంగా పాఠశాలలు ప్రారంభించే తేది వాయిదాపడింది. అందువల్ల ఈ నెల 27వ తేది పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశమై పాఠశాలలు ఎప్పుడు ప్రారంభించాలన్న దానిపై చర్చించి నిర్ణయం తీసుకొనే అవకాశముందని అధికారులు తెలిపారు.

కట్టప్ప తరహా పాత్రలు కలకాలం నిలుస్తాయి : సత్యరాజ్


ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో సత్యరాజ్, వసంత్ రవి తదితరులు

చిత్రజ్యోతి

'వెపన్' చిత్రంలో తాను పోషించిన పాత్ర కట్టప్ప తరహాలో పది కాలాలపాటు నిలిచిపోతుందని సీనియర్ నటుడు సత్యరాజ్ అన్నారు. మిలియన్ స్టూడియో ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత ఎం.ఎస్. మన్సూర్ సమర్పణలో గుహన్ చెన్నియప్పన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెపన్'. సత్యరాజ్, వసంత్ రాజ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ తాజాగా నగరంలో జరిగింది. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని ఈ నెలలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేయనున్నారు. తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'విజయకాంత్, సత్యరాజ్ మంచి పీక్‌స్టేజ్‌లో ఉన్న సమయంలో ఎంతో ఆరోగ్యకరమైన పోటీ ఉండేది. అప్పటి నుంచి ఇప్పటివరకు సత్యరాజ్ రాణిస్తూనే ఉన్నాయి. ఆయన అనేక మంది దర్శకులను పరిచయం చేశారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో సత్యరాజ్ తొలిసారి ప్రయత్నించడం అభినందనీయం. ఈ చిత్రం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు' అన్నారు. సత్యరాజ్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో ఇద్దరు హీరోలు. కానీ ఈ చిత్రానికి నిజమైన ఇద్దరు హీరోలు నిర్మాత మన్సూర్, దర్శకుడు గుహన్. కథపై ఉన్న నమ్మకంతో భారీ పెట్టుబడిపెట్టారు. హై టెక్నికల్ వాల్యూస్‌తో తెరకెక్కించారు. 'బాహుబలి'లో నేను పోషించిన కట్టప్ప పాత్ర తరహాలో ఈ చిత్రంలోని పాత్ర పది కాలాల పాటు ప్రేక్షకుల నోళ్ళలో నానుతుంది' అని పేర్కొన్నారు. హీరో వసంత్ రవి మాట్లాడుతూ 'తమిళంలో సూపర్ హ్యూమన్ స్టోరీలను కథాంశాలుగా చేసుకుని తెరకెక్కించడం సాధారణ విషయం కాదు. దాన్ని దర్శకుడు నిజం చేశారు' అని గుర్తుచేశారు. దర్శకుడు గుహన్, నటుడు షైమ్‌గోపి, హీరోయిన్ తాన్యా హోప్, టెక్నీషియన్లు తదితరులు ప్రసంగించారు.

ఎస్కే సరసన రష్మిక

వరుస విజయాలతో దూసుకెళుతున్న హీరో శివకార్తికేయన్ సరసన రష్మిక మంథన్నా నటించనుంది. దానికోసం ఆమెతో సంప్రదిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 2022లో శివకార్తికేయన్ హీరోగా డెబ్యూ డైరెక్టర్ శిబి చక్రవర్తి రూపొందించిన చిత్రం 'డాన్' ఘన విజయం సాధించడంతో పాటు లాభాలపంట పండించింది. ఈ చిత్రం తర్వాత దర్శకుడు శిబి చక్రవర్తికి మంచి పేరుతో పాటు గుర్తింపు కూడా వచ్చింది. దీంతో తన తదుపరి చిత్రం కోసం కథ సిద్ధం చేసుకుని సూపర్ స్టార్ రజినీకాంత్, నేచురల్ స్టార్ నానికి వినిపించగా, వారిద్దరికీ నచ్చకపోవడంతో తనకు దర్శకుడిగా తొలి అవకాశం ఇచ్చిన హీరో శివకార్తికేయన్‌ను కలిసి వినిపించడంతో ఆయనక ఓకే చెప్పారు. ఫ్యాషన్ స్టూడియోస్ బ్యానరుపై నిర్మాత సుధన్ నిర్మించే ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికను ఎంపిక చేయాలని నిర్ణయించి, ఆమెను సంప్రదిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.


రష్మిక మంథన్నా

'పోగుమిడం వెగు దూరమిల్లై' ఆడియో రిలీజ్


ఆడియో రిలీజ్‌లో చిత్ర బృందం

షార్క్ 9 పిక్చర్స్ పతాకంపై శివ కిల్లారీ నిర్మాణంలో విమల్ కరుణాస్ ప్రధాన పాత్రల్లో కొత్త దర్శకుడు మైఖేల్ కె.రాజా దర్శకత్వంలో తెరకెక్కిన 'పోగుమిడం వెగు దూరమిల్లై' చిత్రం ఆడియో శనివారం నగరంలో రిలీజ్ చేశారు. మేరీ రికెట్స్, నరేన్, మనోజ్ కుమార్, పవన్, అరుల్ దాస్, దీపా శంకర్, చార్లెస్ వినోద్, వేల రామమూర్తి తదితరులు ఇతర పాత్రలు పోషించారు. డెమిల్ జేవియర్ ఎడ్వర్డ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి ఎన్ఆర్. రఘునందన్ సంగీతం. చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ, 'ఒక సినిమా అవకాశం కోసం పదేళ్ళపాటు చెప్పులరిగేలా తిరిగాను. ఈ సినిమాకు 'పోగుమిడం వెగు దూరమిల్లై' అనే టైటిల్ పెట్టినప్పటికీ ఇక్కడకు చేరుకునేందుకు చాలా దూరం ప్రయాణించాను' అని అన్నారు. నటుడు కరుణాస్ మాట్లాడుతూ, 'దర్శకుడిలో ప్రతిభ పుష్కలంగా ఉంది. మంచి చిత్రాన్ని తెరకెక్కించారు. నిర్మాత మంచి మనస్సున్న వ్యక్తి. న్యూజిలాండ్ వెళ్ళి ఉన్నతస్థాయికి చేరుకున్న భారతీయుడు. చిత్రపరిశ్రమ ఏ ఒక్కరికీ గౌరవించదు. మనకోసం అవసరమైన అవకాశాలు మనమే వెతుక్కోవాలి. ఈ సినిమా కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు' అని పేర్కొన్నారు. హీరో విమల్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నా పాత్ర భావోద్వేగంతో కూడుకున్నది. సంగీత దర్శకుడు రఘునందన్ అద్భుతమైన సంగీతం అందించారు. 15 యేళ్ళుగా స్నేహం ఉన్న కరుణాస్‌తో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటివరకు ఇలాంటి పాత్ర చేయలేదు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు.

1న 'ఇండియన్-2' ఆడియో రిలీజ్


కమల్ హాసన్, శంకర్, శ్రీకాంత్ తదితరులు

ఎస్.శంకర్ దర్శకత్వంలో విశ్వనటుడు కమల్ హాసన్ నటిస్తున్న 'ఇండియన్-2' ఆడియో జూన్ ఒకటో తేదీ విడుదలకానుంది. నగరంలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ ఆడియో రిలీజ్ వేడుకను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ బృందం అధికారికంగా వెల్లడించింది. గతంలో వచ్చిన 'ఇండియన్'కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మొత్తం మూడు భాగాలుగా రూపుదిద్దుకునే చిత్రం రెండో భాగం ఆడియో రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అలాగే, రెండో భాగం విడుదల చేసిన ఆరు నెలల్లో మూడో భాగాన్ని కూడా విడుదల చేయాలని నిర్మాణ సంస్థలు భావిస్తున్నాయి. మూడో భాగం షూటింగ్ కూడా ఇప్పటికే పూర్తి చేసినట్టు సమాచారం. అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూర్చుతున్న ఈ చితంలో కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, ఐశ్వర్య రాజేష్, యోగిబాబు, సముద్రఖని, బాబీ సింహా తదితరులు నటించారు. లైకా ప్రొడక్షన్, రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.



యూనివర్సిటీ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు


విద్యార్థులు ఉన్నతాశయాలతో ముందుకు సాగాలి

- జియో సైన్సెస్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి రవిచంద్రన్

ప్యారీస్, మే 19: విద్యార్థులు ఉన్నతమైన ఆశయాలతో ముందుకు సాగాలని భారత ప్రభుత్వ జియో సైన్స్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డా.ఎం.రవిచంద్రన్ సూచించారు. నగరంలోని సెయింట్ జోసఫ్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 25వ స్నాతకోత్సవం, సెయింట్ జోసెఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఎనిమిదేళ్ల స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థల ఛైర్మెన్ డా.బి.బాబూ మనోహరన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిచంద్రన్ మొత్తం 1,299 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. వీరిలో 1197 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 102 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లున్నారు. అలాగే, యూనివర్సిటీ ర్యాంకులు సాధించిన 29 మందికి ధ్రువీకరణ, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రవిచంద్రన్ మాట్లాడుతూ.. దేశ భవిత యువత చేతుల్లోనే ఉందని, డిగ్రీలు అందుకున్న విద్యార్థులు ఉన్నత విలువలు, ఉత్తమ ఆలోచనలతో జీవితంలో ముందుకు సాగాలని హితవు పలికారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.జెస్సీ ప్రియ, మేనేజింగ్ డైరెక్టర్ బి.శశిశేఖర్, ప్రిన్సిపాళ్లు డా.వడ్డి శేషగిరిరావు, డా.టి.రవిచంద్రన్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

ఏర్కాడులో ఎటుచూసినా ఆహ్లాదం
ఉద్యానవనాల్లో పర్యాటకుల కోలాహలం


ఏర్కాడులోని ఉద్యానవనం వద్ద గుమికూడిన పర్యాటకులు


బోట్ హౌస్ వద్ద పడవ ప్రయాణానికి బారులు తీరిన పర్యాటకులు

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఊటీగా పేరొందిన ప్రముఖ పర్యాటక ప్రాంతం ఏర్కాడులో గత కొద్ది రోజులుగా వర్షాలు కురవటంతో అంతటా చల్లదనం సంతరించుకోవడంతో పర్యాటకుల సందడి పెరిగింది. రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, పుదుచ్చేరి తదితర పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో పర్యాటకులు ఏర్కాడుకు వస్తున్నారు. ఆదివారం సెలవుదినం కావటంతో ఉదయం నుంచే ఉద్యానవనాల్లో ప్రయాణికుల సందడి అధికమైంది. ఈ నెల 22 నుంచి 26 వరకు ఏర్కాడులో ఫ్లవర్‌షో నిర్వహించేందుకు ప్రస్తుతం ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. హార్టికల్చర్ అధికారులు 50వేలకు పైగా పూలకుండీల్లో జినియా, డేలియా, సాల్వియా, కార్నేశన్, జెర్‌బెరా, బెర్‌గున్యా, డెల్‌ఫీనియం, డ్రాగన్ సహా 50 రకాల పూలమొక్కలను అందంగా పెంచారు. ప్రస్తుతం ఆ మొక్కలలోని పూలన్నీ బాగా వికసించి పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. అన్నా గార్డెన్, రోజ్ గార్డెన్‌లోనూ నాటిన పూలమొక్కలన్నీ ప్రస్తుతం పూలతో కనువిందు చేస్తున్నాయి. ఆదివారం ఉదయం నుండే పర్యాటకులు ఈ ప్రాంతాలను సందర్శించి సెల్ఫీలు తీసుకుంటూ సందడిచేశారు. అన్నా గార్డెన్‌లోని ఊయల్లో ఊగేందుకు చిన్నారులు పోటీపడ్డారు. ఇదే విధంగా బోట్‌హౌస్ వద్ద కూడా పర్యాటకుల రద్దీ కనిపించింది.. పడవ సవారీకి గంటలకొద్దీ బారులు తీరారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు పర్యాటక ప్రాంతాలన్నీ పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

దక్షిణ కొరియా యువకుడు.. కరూర్ యువతి

- కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరిగిన ప్రేమ వివాహం


వధూవరులు విజయలక్ష్మి మిన్‌జూన్ కిమ్

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ద్వారా పరిచయమైన దక్షిణకొరియా యువకుడిని కరూరుకు చెందిన ఓ యువతి ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరి ప్రేమకు ఇరువైపు కుటుంబీకులు పచ్చ జెండా ఊపటంతో తమిళమాసమైన వయ్యాసి శుభదినమైన ఆదివారం ఉదయం తమిళ సంప్రదాయ పద్ధతిలో వివాహం అట్టహాసంగా జరిగింది. కరూరుకు చెందిన యువతి విజయలక్ష్మికి కొద్ది నెలల క్రితం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ ద్వారా దక్షిణా కొరియాకు చెందిన మిన్‌జూన్ కిమ్ (28)తో పరిచయం ఏర్పడింది. రోజు గంటల కొద్దీ ఇద్దరూ చాటింగ్ చేసుకునేవారు. వీరి సోషల్‌మీడియా పరిచయం కాస్తా గాఢమైన ప్రేమగామారి ఇద్దరూ వివాహం చేసుకోవాలనుకున్నారు. వీరి ప్రేమ వివాహానికి ఇరువైపు కుటుంబీకులు అంగీకరించారు. దీంతో మిన్‌జూన్ కిమ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆగమేఘాలపై కరూరు చేరుకున్నారు. ఇరువైపు కుటుంబీకులు గత రెండు రోజులుగా పెళ్ళి పనుల్లో తలమునకలయ్యారు. ఆదివారం ఉదయం తమిళ సంప్రదాయం ప్రకారం వారి వివాహం జరిగింది. ఈ వివాహవేడుకల్లో వరుడు పట్టు చొక్కా, పట్టు ధోవతి, పట్టు అంగవస్త్రం ధరించాడు. అతడి తరపు కుటుంబ సభ్యులైన మహిళలు తమిళ సంప్రదాయాన్ని చాటేలా పట్టు వస్త్రాలతో సందడి చేశారు. ఈ ప్రేమపెళ్ళికి విచ్చేసినవారందరికీ చక్కటి శాఖాహార భోజనం వడ్డించారు. అట్టహాసంగా జరిగిన ప్రేమ వివాహాన్ని చూసి స్థానికులంతా విస్తుపోయారు.

వైభవంగా సింగపెరుమాళ్ ఆలయ రథోత్సవం


సింగపెరుమాళ్ ఆలయ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం సింగపెరుమాళ్ ఆలయంలో పాటలాద్రి నరసింహపెరుమాళ్ ఆలయంలో వైయ్యాశి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో నరసింహస్వామివారు పరమేశ్వరుడిలా త్రినేత్రాలు కలిగి ఆశీనుడై కొలువుదీరి ఉండటం విశేషం. ఈ ఆలయంలో వైయ్యాశి విశాఖ ఉత్సవాలు ఈ నెల 13న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఆదివారం ఉదయం జరిగింది. సర్వాలంకరణ శోభితులైన స్వామివారు రథంలో ఆశీనులయ్యాక భక్తులందరూ చెరో వైపు నిలిచి మోకుతాళ్లను పట్టుకుని లాగారు. ఆలయ మాడవీధుల్లో రథంపై ఊరేగిన స్వామివారికి భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించి స్వాగతించారు. ఈ వేడుకల్లో చెంగల్పట్టు, తిరుక్కళికుండ్రం, సింగపెరుమాళ్‌కోవిల్, గూడువాంజేరి, మరైమలర్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ లక్ష్మీకాంత్ భారతిదాసన్, ఆలయ నిర్వహణాధికారి వెంకటేశన్ ఆలయ భట్టాచార్యులు, ఉత్సవ ఉభయదారులు పోలీసుల సహకారంతో భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు.

గిరి ప్రదక్షిణలో ఆలయ వృషభం


గిరి ప్రదక్షిణ చేస్తున్న ఆలయ వృషభం

పెరంబూర్, మే 19: పళని మురుగన్ ఆలయ గిరి ప్రదక్షిణకు భక్తులు ఆలయ వృషభం ప్రత్యేక అలంకరణ చేసి తీసుకొచ్చారు. పళనిలో వైకాశి విశాఖ ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న క్షీరకలశాలతో వస్తున్న భక్తులు స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్నారు. తిరుప్పూర్ జిల్లా తారాపురం మనకడవు ప్రాంతానికి చెందిన క్షీర కలశాలు తీసుకొని ఊరేగింపుగా రాగా, వీరకుమారస్వామి ఆలయ వృషభాన్ని పూలతో అలంకరించి గిరి ప్రదక్షిణ చేయించారు. అనంతరం భక్తులు మురుగన్‌ను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రామేశ్వరానికి పోటెత్తిన భక్తులు


రామేశ్వరం అగ్నితీర్థంలో స్నానాలకోసం గుమికూడి భక్తులు

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): అగ్నినక్షత్రం ఎండలు తగ్గుముఖం పట్టడం, వారాంతపు సెలవులు రావటంతో రామనాథపురం జిల్లాలోని రామేశ్వరం ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. రామనాథస్వామి వారిని, పర్వతవర్ధిని అమ్మవారిని దర్శించేందుకు వేకువజామునే భక్తులు బారులు తీరారు. అదే విధంగా అగ్నితీర్థంలో స్నానమాచరించేందుకు కూడా వేల సంఖ్యలో భక్తులు గుమికూడారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 22 తీర్థ బావుల్లో పవిత్ర జలాలను శిరస్సులపై చల్లుకుని భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం భక్తులంతా ధనుష్కోడి అరిచ్చల్‌మునై, కోదండరామ స్వామి ఆలయం, శ్రీరాముడి పాదాల ప్రాంతం, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ స్మారక స్థలం తదితర ప్రాంతాలను సందర్శించారు. దేశం నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకుల రావడంతో రామేశ్వరం నగరమందటా సందడి అధికమైంది. భక్తుల రాక అధికం కావటంతో పోలీసు అధికారులు సుమారు 200 మంది పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.


తిరుత్తణి పర్వతాలయంపై నూతన వధూవరులు

తిరుత్తణి, తిరుప్పోరూరు ఆలయాల్లో ఒకే రోజు వందకు పైగా వివాహాలు

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రాలు తిరుత్తణి, తిరుప్పోరూరు సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉదయం తమిళ మాసమైన వయ్యాశిలో తొలి శుభముహూర్త దినం కావటంతో ఒకేసారి వందకు పైగా వివాహాలు జరిగాయి. ఓ వైపు వారంతపు సెలవు కావటంతో భక్తుల సంఖ్య అధికం కావటంతో అదే సమయంలో శుభముహూర్తం తోడవటంతో వధూవరులు, వారి తరపు బంధుమిత్రులతో ఈ రెండు ఆలయాలు కిటకిటలాడాయి. తిరుత్తణి ఆలయంలో శనివారం సాయంత్రం నుంచే పర్యాటకులు, భక్తుల సందడి అధికమైంది. ఆదివారం ఉదయం ఆలయం, పరిసర ప్రాంతాల్లోని కల్యాణ మండపాల్లో వివాహ ఏర్పాట్లు జరిగాయి.. ఉదయం ఒకే సమయంలో వంద జంటలకు పెళ్ళిళ్ల జరిగాయి. ఇదే రీతిలో తిరుప్పోరూరు ఆలయం వద్దకూడా సుమారు వంద పెళ్ళిళ్ల జరిగాయి.ఈ రెండు ఆలయాలు ఎట్టు చూసిన పసుపు దుస్తులతో నూతన వధూవరులు, వారి తరపు బంధువులు, స్నేహితులతో సందడిగా మారాయి.

రీల్స్ లైక్‌ల కోసం తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో యువతుల డాన్స్

చెన్నై, మే 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలో ముగ్గురు యువతులు చేసిన నృత్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల కాలంలో రీల్స్ సందడి విపరీతంగా పెరుగుతోంది. రీల్స్ ద్వారా వచ్చే వీడియోలకు లైక్‌లు వందల సంఖ్యలో పొందటానికి యువతీ యువకులు పలు విన్యాసాలు చేయడం నేడు ఫ్యాషనైపోయింది. ఈ నేపథ్యంలో తిరుచ్చిలో ముగ్గురు యువతులు 'మే మాదం తొన్నూతెట్టిల్ మేజర్ ఆనేనే' అనే తమిళ హిట్‌సాంగ్‌కు పది నిమిషాలకు పైగా చేసిన డ్యాన్స్ వీడియో దృశ్యాలు ప్రస్తుతం నెటిజన్లను అలరిస్తున్నాయి. అయితే ఈ రీల్స్ చూసిన తిరుచ్చి రైల్వే పోలీసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ యువతులు డాన్స్ చేసిన ప్రాంతం తిరుచ్చి రైల్వేస్టేషన్ కావడంతో వారు ఆశ్చర్యపోయారు. రైల్వేస్టేషన్‌లో ఇలా రీల్స్ తీయడానికి అధికారులు అనుమతించరు. అయితే రైల్వే పోలీసుల కళ్లుగప్పి, అధికారులకు తెలియకుండా ఆ ముగ్గురు యువతులు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిపైనా, పట్టాలపై నిలిచి ఉన్న గూడ్సు బోగీల ఎదుటా నృత్యం చేస్తూ సినిమా పాటలకు ధీటుగా తీసిన ఆ రీల్స్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ రీల్స్ ప్రస్తుతం తిరుచ్చి రైల్వే స్టేషన్ పోలీసుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఆ రీల్స్ గురించి రైల్వే ఉన్నతాధికారులు విచారణకు దిగటమే ఇందుకు కారణం. ఆ డ్యాన్స్ చేసిన యువతుల ఆచూకీ కోసం రైల్వే పోలీసులు గాలిస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు ఆ రీల్స్‌పై విచారణకు ఆదేశాలు జారీ చేయనున్నారని కూడా చెబుతున్నారు.


తిరుచ్చి సెంట్రల్ రైల్వేస్టేషన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై డ్యాన్స్ చేస్తున్న యువతులు

రక్షణ సైన్యంలో కోలాహలంగా పెంతెకోస్తు పండుగ

ప్యారీస్, మే 19: స్థానిక విల్లివాక్కం నియోజకవర్గ పరిధిలోని అయనావరం రైల్వే క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న రక్షణ సైన్యం సంఘంలో ఆదివారం పెంతెకోస్తు పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. కోర్ ఆఫీసర్లు మెరుపు విక్టర్ ఇమ్మానుయేల్, ఎంపీ రత్ననివేదిత అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో రక్షణ సైన్యం టెరిటోరియల్ కమాండర్స్ యాకూబ్ మసి, సుమిత్రా మసి, ఐపాస్ టీమ్ లీడర్ థెరిస్సా సదరన్ రైల్వే చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఎం.ఆనంద్, లెఫ్టినెంట్ కల్నల్ బి.జోసెఫ్ తదితరులు పాల్గొని పెంతెకోస్తు సండే వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, అలాగే 1 నుంచి డిగ్రీ వరకు చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రార్థించారు. వేడుకల్లో భాగంగా తాటిపర్తి బాబు, ఎం.ఆనంద్, ఇత్తడి మోష, విక్టర్ ఇమ్మానుయేల్ సంఘానికి అందించిన ఎసీలను ప్రారంభించారు. ఏర్పాట్లను కార్యదర్శి సూరిపోగు థామస్, సార్జంట్ మేజర్ వి.సాల్మన్, ట్రెజరర్ గొల్లపల్లి ప్రభుదాస్, ఎఫ్ఎఫ్ఎం ఎస్ఎస్ రాజ్ కుమార్, బలభద్ర సుమన్, పాలిపోగు పురుషోత్తం, ఎస్.నోవా తదితరులు పర్యవేక్షించారు.



పాల్గొన్న తెలుగు క్రైస్తవులు - పెంతెకోస్తు సండే వేడుకల్లో రక్షణ సైన్యం ఉన్నతాధికారులు, సంఘ నిర్వాహకులు


మెరీనాబీచ్‌లో మాజీ ముఖ్య మంత్రి కరుణానిధి స్మారక స్థలాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు


సుబ్బులక్ష్మి నుంచి ఆశీస్సులందుకుంటున్న భక్తులు

భక్తులను ఉత్సాహపరుస్తున్న 'సుబ్బులక్ష్మి'

పెరంబూర్, మే 19: శివగంగ జిల్లా తిరుప్పుత్తూర్ తిరుత్తళినాదర్ ఆలయానికి వచ్చే భక్తులను ఆలయ ఏనుగు 'సుబ్బులక్ష్మి'ని చూసి పరవశులవుతున్నారు. ఈ ఆలయంలోకి ప్రవేశించిన వెంటనే ఎడమ వైపున్న మండపంలో 'శివగామి' పేరుతో ఉన్న ఆలయ ఏనుగు వద్ద ఆశీర్వాదం తీసుకున్న తర్వాతే భక్తులు స్వామి దర్శనం చేసుకుంటారు. మూడేళ్ల క్రితం అనారోగ్యం కారణంగా శివగామి మృతిచెందడంతో ఆలయంలోని ఎడమ వైపు మండపం బోసిపోయింది. ఈ నేపథ్యంలో, వైకాశి విశాఖ ఉత్సవాల సందర్భంగా కుర్రైక్కుడి ఆలయ నుంచి 'సుబ్బులక్ష్మి' అనే ఏనుగుకు రప్పించారు. ప్రస్తుతం మండపంలో ఉంటున్న సుబ్బులక్ష్మిని తమ శివగామిగా భావిస్తున్న భక్తులు, ఆనందంగా ఆశీర్వాదం తీసుకుంటున్నారు.

దిక్సూచి DIKSUCHI



ఇండియా శ్రామిక మార్కెట్

ఇండియన్ ఎకానమీ

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్థభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జి.20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు. ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామిక రంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు(సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్



ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామికరంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్నవారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తుల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-4

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్



ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద ఆంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:

1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR

2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT

3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB

4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK

5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. సమాధానం: (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

2. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

3. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

5. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏమిటి?
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.

4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handగాను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికై ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

నక్సలైట్ టెస్ట్ పేరుతో ఆటవికం

మహిళలను తాకరాని చోట తాకుతూ బలగాల అరాచకం



రఘు మిడియామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆధార్ లేకుంటే ఆదివాసీ మహిళలకు హింసే
- మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ
- రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు
- అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం
- 'ఆంధ్రజ్యోతి'తో.. ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళలను తాకరాని చోట తాకడం.. ఈ పరీక్షలో మహిళ వక్షోజాల నుంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సిలేంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలేంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి స్మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలేంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత కర్కశంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలా మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్ట్‌లు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. మిగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లోని బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. పూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'



విజయవాడ పటమట ప్రాంతంలో మబ్బులు కమ్మేసిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. పిడుగులు.. నేడూ కొనసాగే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పెదకూరపాడులో 55.5, వత్సవాయిలో 40, జగ్గయ్యపేటలో 39.5, అడ్డతీగలలో 38, చింతలపల్లిలో 36, అనపర్తిలో 35.2, రావికమతంలో 35.7, రాజవొమ్మంగిలో 35, బిక్కవోలులో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం మన్యం, అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరు జిల్లాల్లోని 24 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

- రైల్వే, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం
- లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు
- రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు
- సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్‌నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీనగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి 'నియామకపత్రాన్ని' కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాలవ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూడగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్లు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయ పన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్, రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్లు సమాచారం.